News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in
CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in
సంపుటి : 05 | సంచిక :56 | ఖమ్మం | శనివారం, ఏప్రిల్ 11, 2026 | CK NEWS | పేజీలు : 08
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# ఢిల్లీలో సీడబ్ల్యూసీ సమావేశం.. హాజరైన సీఎం రేవంత్




ఢిల్లీలోని ఇందిరా భవన్ లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. శుక్రవారం ( ఏప్రిల్ 10 ) మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ కీలక నేతలు హాజరయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చినట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఉన్న క్రమంలో సీడబ్ల్యూసీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశంపై పార్లమెంటులో చర్చించి చట్టసవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తోంది కేంద్రం.పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలు, పార్టీ లైన్ పై సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?



తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏప్రిల్ 10, 2026న జరిగిన విలేకరుల సమావేశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2014లో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గత పదేళ్ల పాలనలో భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆయన ఆరోపించారు.

మంత్రి జూపల్లి చేసిన ప్రధాన వ్యాఖ్యలు ఇక్కడ ఉన్నాయి:

**8 లక్షల కోట్ల అప్పు:** గత ప్రభుత్వం రాష్ట్రంపై దాదాపు ?8 లక్షల కోట్ల అప్పు భారాన్ని మోపిందని, ఈ స్థాయి అప్పులు చేసినా రాష్ట్రానికి తగిన స్థాయిలో ఆస్తులు సృష్టించలేదని ఆయన విమర్శించారు.

**వడ్డీల భారం:** గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుతం రాష్ట్రం నెలకు సుమారు 6,500 కోట్లు అసలు మరియు వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని, ఈ భారాన్ని మోయడం ప్రస్తుత ప్రభుత్వానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులు:** పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, కేవలం ?25,000 కోట్లు ఖర్చు చేసి 80% పనులు పూర్తయ్యాయని అబద్ధాలు చెబుతున్నారని హరీష్ రావుపై మండిపడ్డారు.

**సంక్షేమ పథకాల అమలు:** అప్పుల భారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను మరియు రైతు రుణమాఫీని అమలు చేయడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందన్న కవిత
- ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో రేవంత్ కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ఆరోపణ
- నిధులు దారిమళ్లిస్తున్నారంటూ విమర్శలు



హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు.ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

- తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు
- 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరిన కరవు భత్యం
- జనవరి 2026 నుంచి అమల్లోకి రానున్న పెంపు
- సంస్థపై నెలకు రూ.2.82 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 38 వేల మందికి పైగా సిబ్బందికి ప్రయోజనం



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది.డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు.

సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక

సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి.. తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

- కూసుమంచి మండలంలో కొత్తగా నిర్మించిన గోదామును ప్రారంభించిన పొంగులేటి
- గత ప్రభుత్వ ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న మంత్రి
- రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తున్నామని వెల్లడి
- ఇందిరమ్మ రాజ్యాన్ని మరోసారి దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య



తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 'అన్నా.. మీతో కలిసి పనిచేయమని దేవుడు పంపించాడన్నా'




తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఈరోజు కలిశారు. కేసీఆర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి, ఆలింగనం చేసుకుని, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డితో పాటు ఆయన కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కూడా ఆయనతో పాటు ఉన్నారు.పాత మిత్రులు కలవడంతో అక్కడ ఎంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది. కేసీఆర్‌ను చూడగానే జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే మీ దగ్గరికి పంపాడు, మీతో కలిసి పనిచేయమని కోరాడు" అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న ప్రస్తుత తరుణంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాల్సిన అవసరం ఉందని జీవన్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. చాలా కాలం తర్వాత ఇన్నాళ్లకు కలిసి పనిచేసే అవకాశం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు, ఎర్రవెల్లికి చేరుకున్న జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు.


# తెలంగాణలో ఒంటరి పోరే




**హైదరాబాద్, ఏప్రిల్ 10, :** తెలంగాణలో బీజేపీ ఇక ఒంటరిపోరుకే సిద్ధమవుతుంది. ఎటువంటి పొత్తులకు సిద్ధపడకూడదని నిర్ణయించినట్లు కనపడుతుంది. రానున్న కాలంలో టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకుంటుందన్న ప్రచారాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బహిరంగంగానే ఖండించారు. ఆ పొత్తు వల్ల ప్రమాదమే కాని... ప్రయోజనం లేదని తెలంగాణ బీజేపీ నేతలు ఫిక్స్ అయినట్లుంది. మొన్నటి మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ప్రచారానికి రావాలని ఆహ్వానించిన నేతలు తర్వాత మాత్రం ఆ ఆలోచనను విరమించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఎవరితో పొత్తు ఉండదని ప్రకటించారు. దీని వెనకకూడా అదే కారణమని అంటున్నారు. టీడీపీ, జనసేనలకు ఆంధ్రాపార్టీలుగా ముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ,జనసేన, బీజేపీలు పొత్తులో ఉన్నాయి. అయితే తెలంగాణకు వచ్చే సరికి ఆ పొత్తు పనిచేయదు. కూటమి వికటిస్తుంది. సెంటిమెంట్ అంటుకుంటే అసలుకే మోసం వస్తుంది. అందుకే ఏఎన్నికల్లోనూ టీడీపీ,జనసేనలతో నేరుగా పొత్తు పెట్టుకోకూడదని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఇదే అభిప్రాయం కేంద్ర నాయకత్వంలోనూ ఉంది.తెలంగాణలో బీజేపీ ఒంటరిగా ఎదుగుతుంది. ఇప్పటికే గతం కంటే బలంగాతయా రయింది. అలాంటి సమయంలో అనవసరపు పొత్తులకు వెళ్లి పార్టీని ప్రజల్లో పలుచన చేయకూడదని భావిస్తున్నారు. ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే సూత్రాన్ని పాటించాలని

రాష్ట్ర నాయకత్వం కేంద్ర నాయకత్వానికి తెలియజెప్పిందని, అందుకు హైకమాండ్ కూడా అంగీకరించిందంటున్నారు. మరొకవైపు టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు తమకు టర్న్ అయ్యే అవకాశం కూడా లేదని, పొత్తు పెట్టుకుంటే ఆ ఓట్లు పడకపోగా, పడే ఓట్లు కూడా రావన్నది పార్టీ నేతల అంచనాగా ఉంది.

## వివాహిత అదృశ్యం.. కేసు నమోదు





**గార్ల ఏప్రిల్ 10:** గార్ల మండల పరిధిలోని చవిటి తండా గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు గార్ల ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చవిటి తండా గ్రామానికి చెందిన బానోత్ సంగీత (19) వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈనెల 5వ తారీకు ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుండి బయటికి వెళ్లిపోయింది దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో సంగీత భర్త బానోతు లోకేష్ ఫోన్ ద్వారా పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వగా వెంటనే ఫిర్యాదు ఇంటికి వెళ్లి అతని వద్ద నుండి దరఖాస్తు తీసుకొని మిస్సింగ్ కేసు నమోదు చేశామని ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## తుమ్మలపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వైరా, ఏప్రిల్ 10 :** తుమ్మలపల్లి గ్రామంలో స్థానిక నాయకులు కమతం నాగేశ్వరరావు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల ఇబ్బందులు తొలగించి, కొనుగోలు ప్రక్రియను, తూకం, సాంకేతిక సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో రైతుల ఇతర సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తున్నారు. "రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది" అనే నినాదంతో గ్రామాభివృద్ధికి ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ, సంతాపం తెలిపిన దీపక్ చౌదరి

**మధిర, ఏప్రిల్ 10 :** ఖమ్మం జిల్లాలో, కాంగ్రెస్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆరో డివిజన్లో పలువురిని పరామర్శించి సంతాపం తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు లింగ బోయిన వెంకటేశ్వర్లు గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రశాంత్ నగర్ రోడ్ నెంబర్ 4 లో తుమ్మల లాలయ్య కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆరో డివిజన్ అధ్యక్షులు ఎడవల్లి వీరయ్య గౌడ్, చంద్ర శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంఘటనలు ఖమ్మం జిల్లాలో జరిగాయి.

## అరైవ్ , అలైవ్, పకడ్బందీగా నిర్వహించాలి

**పాలేరు, ఏప్రిల్ 10 :** మణుగూరులో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్, అలైవ్ కార్యక్రమాన్ని ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సురేష్ తెలిపారు. శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డు భద్రతే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తాసిల్దార్ నరేష్, సిఐ నాగబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.

## మిట్టగూడెం అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన ఘనంగా

**కొత్తగూడెం, ఏప్రిల్ 10 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం మిట్టగూడెం గ్రామపంచాయతీలోని పీఎం గుంపు అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఝాన్సీ, హెల్త్ విభాగం హెచ్‌పి కౌసల్య, ఏఎన్ఎం కనకమ్మ, కమిటీ సభ్యులు, తల్లులు, అంగన్వాడి టీచర్ కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

## నందనాయక్ తండా అంగడి వేలం:

**పరకాల, ఏప్రిల్ 10 :** ఉమ్మడి వరంగల్ జిల్లా, పరకాలలోని గీసుగొండ మండలంలోని నందనాయక్ తండా గ్రామ పంచాయతీ ఆవరణలో మండల పంచాయతీ అధికారి పాక. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగడి వేలం జరిగింది. ఈ వేలంలో కాంద్రు మాధవరావు అత్యధికంగా రూ. 18,90,116 పాట పాడి వేలం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్యా వేరేందర్, ఉపసర్పంచ్ రాము, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఈగ లావణ్య, పాటాదారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 2 లక్షల రేషన్ కార్డుల రద్దు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, :**
రాష్ట్రంలో రేషన్ కార్డుల అనర్హుల జాబితాను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. విజిలెన్స్ అధికారులు రహస్యంగా ఆడిట్ నిర్వహించగా.. భారీగా అవకతవకలు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు రేషన్‌కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అనర్హులు కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది.పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్) చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం



వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్‌కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం.మరోవైపు.. అనర్హులుగా తేలిన వారి రేషన్ కార్డులను రద్దు చేయడంపై ఇప్పుడు అధికారులు దృష్టి

సారించారు. ఈ నేపథ్యంలోనే కేవలం రేషన్ కార్డులను రద్దు చేయడం మాత్రమే కాకుండా వారు పొందిన సబ్సిడీని కూడా తిరిగి వసూలు చేసేలా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందిన అనర్హుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా రేషన్ కార్డులను జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 లక్షల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలె గణాంకాలు విడుదల చేసింది. ప్రస్తుతం తెలంగాణలో 17,348 రేషన్ దుకాణాలు ఉండగా.. వాటి నుంచి నెలకు 1.05 కోట్ల రేషన్ కార్డు దారులకు సరుకులు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. వీటిలో 99,36,073 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు కాగా.. మరో 5,66,660 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయని పేర్కొంది. 5146 అన్నపూర్ణ కార్డులు కూడా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది

# కేసీఆర్ వెంట... రెండు సార్లు కేసీఆర్ పై పోటీ..

**హైదరాబాద్, ఏప్రిల్ 10, :** తెలంగాణ రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ఓ ప్రత్యేక శైలి. 1983లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినా ఇంకా సొంత నియోజకవర్గానికి మాత్రమే అంటిపెట్టుకుని ఉన్న అరుదైన నేత. అంతే కాదు ఏ కేసీఆర్‌పై రెండు సార్లు పోటీ చేసారో ఇప్పుడు అదే కేసీఆర్ పార్టీలోకి వెళుతుండటం ఆసక్తికర పరిణామం. ఒకప్పుడు ఎవరినైతే ఓడించడానికి తన సర్వశక్తులూ ఒడ్డారో, నేడు అదే నాయకుడి వెనుక నడవడానికి సిద్ధపడ్డారు. జగిత్యాల ప్రజల తలలో నాలుకగా మెదిలి, కాంగ్రెస్ కోటను కాపాడిన తాటిపర్తి జీవన్ రెడ్డి, నేడు గులాబీ కండువా కప్పుకోవడం వెనుక రాజకీయ అవసరాలకు మించిన ఆత్మగౌరవం, అసంతృప్తి

దాగి ఉన్నాయి.తెలుగు రాష్ట్రాల రాజకీయాలు తెలిసిన ఎవరికైనా జీవన్ రెడ్డి పేరు సుపరిచితం. నేటి ధిగ్గజనేతలు కేసీఆర్, చంద్రబాబు సమకాలికుడే కాదు, 1983లోనే ఎమ్మెల్యే.. యువ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ గడ్డుకాలంలో చాలా సందర్భాల్లో జీవన్ రెడ్డి గెలిచి తన ప్రత్యేకత చాటుకున్నారు. అంతే కాదు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ కేసీఆర్ సెంటిమెంటును కొనసాగించేందుకు రాజీనామాలు, ఉపఎన్నికల ఎత్తుగడలు వేసేవారు అలా 2006, 2008 కరీంనగర్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కేసీఆర్ పై కాంగ్రెస్ తరపున పోటీకి నిలిచారు. మొదటిసారి రెండు లక్షల ఓట్లతో కేసీఆర్ గెలిచినా.. 2008లో మాత్రం వైఎస్ సహకారంతో జీవన్ రెడ్డి కేసీఆర్ కు ముచ్చెమటలు పట్టించారు. కరీంనగర్ లో తనకు ఎదురు లేదనుకున్న గులాబీ నేతను దాదాపు ఓటమి అంచులదాకా నెట్టి కేవలం 15వేల మెజారిటీ మాత్రమే ఇచ్చారు. కానీ, కాలక్రమేణా పరిస్థితులు మారాయి. నేడు అదే కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ, "ప్రజలు కోరిన దానికంటే ఎక్కువే చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్" అని జీవన్ రెడ్డి కీర్తించే దాకా పరిణామాలు మారాయి. శత్రువు నుంచి మిత్రుడిగా మారిన ఈ



ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.జీవన్ రెడ్డి అంటే సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి ఉదాహరణ. ఆయన ఇల్లు, ఆఫీసు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఆధునిక కార్పొరేట్ రాజకీయాల హంగులు ఆయన దరిచేరలేదు. ఆయన ఆఫీసు డెస్కు దశాబ్దాల నాటి పాత శైలిలో ఉంటుంది. అత్యంత సాధారణంగా ఉండే ఆ గదిలోనే వేల మందిని ప్రతిరోజూ కలుస్తుంటారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఆయన జీవనశైలి మారలేదు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే 'ఓపెన్ డోర్' పాలసీ ఆయనది. గల్ఫ్ బాధితులైనా, స్థానిక పేదలైనా ఆయన వద్దకు వెళ్లి కష్టాలు తీర్చమని అడుగుతారు. ఇంటికి వచ్చిన వారికి పప్పు, పచ్చిపులుసు, మామిడికాయ తొక్కుతో 'సింపుల్ లంగర్' దశాబ్దాలుగా వడ్డిస్తున్నారు. వైఎస్ హయాంలో అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ సాధించుకున్న నేత కూడా జీవన్ రెడ్డి గారే. కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పర్యటనలు, 10 జనపథ్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు సర్వసాధారణం. కానీ, జీవన్ రెడ్డి శైలి వేరు. ఆయన ఎన్నడూ పదవుల కోసం ఢిల్లీ వీధుల్లో లాబీయింగ్ చేయలేదు. తనకు పదవి రావాలన్నా, పోవాలన్నా అది తన పనితీరు మీద ఆధారపడాలే తప్ప హైకమాండ్ ప్రదక్షిణల వల్ల కాదన్నది ఆయన నమ్మకం. తన నియోజకవర్గమే ఢిల్లీ, ప్రజలే హైకమాండ్ అన్నట్లుగా సాగుతారు. ఇప్పుడు రేవంత్ తో వైరం కూడా ఆ ఆత్మగౌరవ ప్రతిష్టతోనే వచ్చిందని చెబుతారు. 42 ఏళ్ల పాటు పార్టీతో నడిచి నేడు వీడటానికి జీవన్ రెడ్డి చెప్పిన కారణాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. "తెలంగాణ ప్రజలు మార్పు కోసం ఆశపడి ఓటేశారు, కానీ నేడు నిరాశకు గురవుతున్నారు" అని ఆయన చేసిన విమర్శలు చాలా ఘాటైనవి. ఫిరాయింపుల రాజకీయాలను ప్రోత్సహించడం, సీనియర్లకు గౌరవం ఇవ్వకపోవడం వంటి అంశాలు ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 2014లో ఒంటరి పోరాటం చేసి గెలిచిన తనకు, నేడు సొంత పార్టీలోనే గుర్తింపు కరువైందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జీవన్ రెడ్డిని కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించింది. 2018లో ఓడిపోతే ఎమ్మెల్సీని చేసింది. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో మంత్రిని చేసింది. మొత్తం 14 సార్లు జీవన్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. బుజ్జగించేందుకు జాతీయ నేతలు, పీసీసీ అధ్యక్షులతో సహ అందరూ ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ లో కొనసాగాలని కోరారు. కేవలం ఒకరితో ఆభిజాత్యానికి పోయి తల్లిలాంటి పార్టీని వీడటం సరికాదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ లాంటి కుటుంబ పార్టీలోకి వెళ్తే కేసీఆర్ ప్రేమలు ఎప్పటికీ ఉండవని హెచ్చరిస్తున్నారు.జగిత్యాల గడ్డపై తనకంటూ ఒక ముద్ర వేసుకున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు కేసీఆర్ గూటికి చేరబోతున్న నేపథ్యంలో.. ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు మారతాయా. రాజకీయం అంటే కేవలం అధికారమే కాదు, ఆత్మగౌరవంతో కూడిన ప్రయాణం అని జీవన్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారు. బిఆర్ఎస్‌లో ఆయన ప్రస్థానం ఎలా సాగుతుందో.. తన కోడలికి రాజకీయ వారసత్వం అప్పగించి వానప్రస్తంలోకి జారుకుంటారో చూడాలి!

# స్టీల్ బ్యాంక్... ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఆదర్శం

సోషల్ మీడియాను తెగ తిడుతుంటాం. అందర్నీ పాడు చేస్తోందని. కానీ కోవిడ్ లాంటి సమయాల్లో, లేదా క్లిష్టమైన సమయాల్లో సోషల్ మీడియానే ప్రముఖ పాత్ర పోషించింది. అనేక ముఖ్యమైన సమాచారాలు, ఆరోగ్య సమాచారాలు, ఇతరులకు సేవ చేసే విషయాలు ఈ వేదిక ద్వారానే ప్రపంచానికి తెలిసాయి.అంతేకాకుండా చాలా మంచి మంచి విషయాలను కూడా సోషల్ మీడియా సమాజం ముందుకు తెస్తుంది. దీంతో సమాజానికి చాలా మేలు చేకూరుతుంది. తాజాగా ఇలాంటి ఓ వార్తే సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో ఊరు ఊరంతా మారిపోయింది. పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించింది ఆ గ్రామం. గ్రామంలో ఇంతటి మార్పుకు కారణమైంది మన సోషల్ మీడియానే. ఇదంతా జరిగింది బాసర సమీపంలోని గుండంపల్లి గ్రామం.ఈ రోజుల్లో ప్రతిదీ ప్లాస్టిక్ అయ్యింది. దీంతో కాన్సర్ కి కారణం అవుతోంది. ఏ ఫంక్షన్ జరిగినా, చిన్న కార్యక్రమం జరిగినా.. ప్రయాస పడకూడదని ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. వాడేస్తున్నారు, పాడేస్తున్నారు. దీంతో మనుషులకు కేన్సర్ లాంటి రోగాలు రావడంతో పాటు వాటిని తిన్న పశువులు కూడా తీవ్ర అనారోగ్యానికి బలి అవుతున్నాయి.ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గుండంపల్లి గ్రామస్థులు అలర్ట్ అయ్యారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో "స్టీల్ బ్యాంకు"ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ వీటినే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో ఇదో కీలక అడుగుగా భావిస్తున్నారు. శుభ కార్యాల్లో ఇందులోనే తిని, వాటిని ప్రజలే శుభ్రం చేసి, తిరిగి ఇచ్చేస్తున్నారు.అలాగే అనుమతి లేకుండా తమ గ్రామంలో విక్రయిస్తున్న ఐస్ క్రీమ్ లపై కూడా అలర్ట్ అయ్యారు గ్రామస్థులు. వాటిని తమ గ్రామంలోకి అనుమతించ కూడదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోనే ఇలాంటి వాటిని అడ్డుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వాడొద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారుగుండంపల్లి గ్రామస్థులందరూ ఐకమత్యంతో స్టీల్ ప్లేట్ల వాడకం, పర్యావరణాన్ని కాపాడలన్న నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రానికి దిక్సూచిగా మారారు. వీరు తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఏ ప్రభుత్వ అధికారులు చెప్పకపోయినా, స్వచ్ఛందంగా, ప్రకృతిపై వున్న మమకారంతో, తమ ఆరోగ్యం విషయంలో తీసుకునే శ్రద్ధ కారణంగా, అవగాహన కారణంగా ఈ విజయం వరించింది.

అలాగే ప్రతి ఇంటి నుంచి కూడా సహకారం లభించడంతో విజయం సాధించారు.ప్రజల్లో చైతన్యం పెరిగితే మార్పుదానంతటన అదే వస్తుందని మరోసారి నిరూపితమైంది.ఒక గ్రామంలో 500 స్టీల్ ప్లేట్లు 20 కార్యక్రమాల్లో వాడితే... 10,000 ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం తగ్గినట్టే. అదే ప్రతి గ్రామం చేస్తే... పర్యావరణానికిఎంత మేలు జరుగుతుందో ఊహించండి.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



సికే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు ఏప్రిల్ 10 2026: మండలంలోని ఏన్కూరు చెరువు బజార్ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన లేల వెంకమ్మ సుక్కులు నివాస గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు అంటుకుని పూరిల్లు దగ్ధమైంది.

సమాచారం ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు ఒక గంట సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, ఇంటిలో ఉన్న సామాన్లు, గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.

మంటలు ఎగసిపడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి, నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. వారి చొరవతో అగ్ని మరింత వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ ఘటనతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ను ప్రారంభించిన,

- మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్



ఏప్రిల్ 10 (సీ కే న్యూస్) చేగుంట: చందాయిపేట్ గ్రామం లో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులకు ధాన్యం అమ్మి

మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు, గ్రామ సెక్రటరీ కృష్ణ, జి పి ఓ, రాత్నకుమారి,ఏపీఎం దుర్గ ప్రసాద్, సీసీ స్వామి,ఏ ఈ ఓ భువనేశ్వరి, వి ఓ ఏ స్వామి,వార్డ్ మెంబెర్స్, గ్రామ రైతులు, ఆనందాస్ ఆంజనేయులు, ఆక్బార్, మధు, మల్లేష్, రాజు,ఆశా వర్కర్స్, వివో లీడర్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన కాంగ్రెస్ నాయకుల కృషి

- రెండు దశాబ్దాల కల నెరవేర్చనున్న శ్రీనన్న



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం

గత రెండు దశాబ్దాలు గా ఆటో నగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ వరకు నిత్యం రద్దిగా వుండే రోడ్ కనీస మరమ్మత్తులు అనేవి కూడా నోచుకోకుండా గ్రామపంచాయతీగ ఉన్నప్పుడు కనీసం పట్టించుకునే వారు లేక ఈ రోడ్ నుండి రాకపోకలు సాగించు ప్రజల కష్టాలు పట్టించుకునే వారు లేక ఇబ్బందులకి గురవుతున్నారు. ప్రజా ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు దాటుకొని ఆటోనగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ వరకు రోడ్ నిర్మాణానికి రేపు శంకుస్థాపన చేయబోతుంది. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన మాట కొరకు పోరాడి అడ్డంకులు దాటుకొని 30 వ వార్డు ప్రజల కల నెరవేర్చటానికి చేసిన కష్టానికి ఫలితం ఈ రోజు మన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదగా శంకుస్థాపనే . ప్రజల కొరకు పోరాడేది మన కాంగ్రెస్ పార్టీ, ప్రజల పక్షాన నిలబడేది మన శ్రీనన్న.మా కష్టాన్ని గుర్తించి మా సమస్య కి శాశ్వత పరిస్కారం చూపిన మా అన్న పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవే మా ప్రత్యేక ధన్యవాదములు ప్రజల తరుపున ప్రభుత్వానికి మన పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సమస్యను విన్నవించి రోడ్ మంజూరుకు పాటు పడిన భూక్యా సురేష్ నాయక్, గనపారపు వీరయ్య, కొట్టం శిరీష రంజిత్ రెడ్డి గార్లకి ఇవే మా ప్రత్యేక ధన్యవాదములు.

# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల.

- అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 11,650కు పారదర్శక టెండర్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు.
- త్వరలోనే 15 వేల అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్.
- సిబ్బంది సంక్షేమం, వేతనాల పెంపుపై సానుకూల నిర్ణయం త్వరలో
- అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క).




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 10,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివాసి సంప్రదాయమైన కొమ్ము నృత్యంతో స్వాగతం పలికిన అనంతరం మంత్రి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను సందర్శించి, అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన ఆహార పదార్థాలు, పిల్లలకు అర్థమయ్యే విధంగా రూపొందించిన విద్యా నమూనాలను పరిశీలించారు.

అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. "బేటీ బచావో" పథకం కింద ఆడపిల్లల తల్లులకు హిమాలయ కిట్లను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోషకాహార కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పిల్లల బరువు, పోషకాహార వివరాలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, వేగం పెరుగుతాయని వివరించారు.

స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడిందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ టెండర్ విధానంలో కొనుగోలు చేపట్టగా ప్రారంభంలో సుమారు రూ " 14,000 వరకు ధరలు వచ్చినప్పటికీ పలు దఫాల టెండర్ ప్రక్రియ అనంతరం ఒక్కో ఫోన్‌ను రూ 11,650కు పొందగలిగామని తెలిపారు. ప్రజల డబ్బు ఆదా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం రూ 9,000కు ఫోన్లు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పారదర్శక విధానంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు.

ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో అంగన్‌వాడీలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాలను పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 12 వేల భవనాలు మంజూరు చేయడం, మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఇప్పటివరకు సుమారు రూ 8 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జీవో విడుదలకు ముందే రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వేతనాల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. అదేవిధంగా సుమారు 15 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకు కేంద్ర ప్రభుత్వం కేవలం రూ 2,800 మాత్రమే అందిస్తోందని, మిగతా భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. జీతభత్యాల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 275 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో నిపుణులు, అంగన్‌వాడీ టీచర్లతో కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చర్యలపై మేధోమథనం నిర్వహిస్తామని చెప్పారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లా, బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను తమ సొంత పిల్లలుగా భావించి సేవలు అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూలి అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్‌లు అందించడం ద్వారా సేవల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ఆధునికీకరించడంలో ఈ కార్యక్రమం కీలకమని, కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కీలకమని పేర్కొన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చామని, చెంద్రుగొండ మండలం మద్దుకూరు కేరళ తరహాలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అన్ని కేంద్రాలకు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల విస్తరణతో సేవలు మరింత విస్తరించాయని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి జీతభత్యాలు పెంపు, సంక్షేమ చర్యలు మరింత విస్తరించాలని మంత్రి ని కోరారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో 1954 అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ చేయడం ద్వారా ఐసీడీఎస్ సేవలు మరింత సమర్థవంతంగా అమలు అవుతాయని తెలిపారు. డేటా సేకరణ, నివేదికల పంపిణీ, లబ్ధిదారుల వివరాల నిర్వహణ సులభతరం అవుతుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 2061 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అన్ని అంగన్వాడీ కేంద్రాలలో విద్యుదీకరణ పనులు పూర్తి చేశామని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. 197 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పిల్లల వివరాల నమోదు, పోషకాహారం పంపిణీ వంటి కార్యక్రమాల్లో ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు .

అనంతరం మంత్రి చేతుల మీదుగా అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత, జిల్లా అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10,ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక మరియు హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనిమన్ జన్మదిన సందర్భంగా ప్రపంచ యోగ దినోత్సవం భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డిపార్ట్మెంట్ యోగ అవగాహనా శిబిరం మరియు ఆయుర్వేద, హోమియో మరియు యునాని వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంని అనేక మంది రోగులు సద్వినియోగపరుచుకున్నారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్, అదనపు జిల్లా అధికారి డా. సైదులు, ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఒ డా. రాజశేఖర్ రెడ్డి, ఆయుష్ జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వరరావు, డాక్టర్లు రాజేందర్, లావణ్య, ఉషారాణి, జయ, వెన్నెల, పూజ,,రాజేష్, పారామెడికల్ సిబ్బంది, యోగ బోధకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహాని ప్రారంభించిన ఇంచార్జీ, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి

ఇందిరమ్మ కలలు నెవవేస్తున కాంగ్రెస్ పార్టీ



ఏప్రిల్ 10 (సీ కే న్యూస్) చేగుంట:చేగుంట మండల కేంద్రం లో ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారుడు దాసరి పద్మ, కృష్ణ దంపతుల ఇందిరమ్మ ఇళ్లను చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ తో కలిసి శుక్రవారం రోజు దుబ్బాక నియోజవర్గ ఇంచార్జీ సిహెచ్ శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు వారి కుటుంబ సభ్యులు, రాష్ట్ర ప్రజా ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, సి హెచ్ శ్రీనివాస్ రెడ్డికి,నాకుఇల్లు రావడానికి కృషి చేసిన మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కి, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ప్రత్యేక

కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నర

సంవత్సరాలలో గడుస్తున, మన దుబ్బాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేద కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చాము అని అన్నారు. అతిత్వరలోనే చేగుంట పట్టణంలో కూడా 50 ఇళ్లకు శ్రీకారం చుట్టబోతున్నాము అని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమం పక్కకు పెట్టి కమిషన్ ల కోసం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది అని అన్నారు.. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక సంక్షేమాలను పేద ప్రజలకు అందించి వారి ఆశీర్వాదాలు అందుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎఎంసి ఛైర్మెన్ తాడేం వెంగళరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, బోనాల సర్పంచ్ సుకన్య నాగులు, ఉపసర్పంచ్ నాగరాజు, ఎఎంసి డైరెక్టర్ బాల్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు ఎం .శ్రీనివాస్, వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్,యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,గ్రామ వార్డు సభ్యులు నాగులు, నరేశ్,భూపతి, చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవకమిటీ కన్వీనర్ గా పల్లగొర్ల మోదీరాందేవ్ ను నియమించిన ప్రభుత్వం







సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 10.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ంగా నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్గా మాజీ ఎంపీ ఎస హనుమంతరావు, వైస్ చైర్మన్ లను, కన్వీనర్ గా పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ ను నియమిస్తూ శుక్రవారం జీవోఅశీ 174 జారీ చేయడం జరిగింది ప్రభుత్వం వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే మహనీయుని కమిటీలో చోటుదక్కడం అదృష్టంగా భావిస్తున్నాను 16 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసినందుకుగాను గుర్తించి కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వానికి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ వీూ ఆర్ కృష్ణన్నకు ప్రత్యేక ధన్యవాదాలు పాదాభివందనాలు తెలియజేశారు , బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్,బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్, పూలే కమిటీ చైర్మన్ వి.హెచ్ హనుమంతరావు అన్నకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు 11వ తేదీన రవీంద్రభారతిలో మరియు జిల్లా కేంద్రాలతో పాటు మండల మరియు గ్రామ గ్రామ పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

# ముస్లిం సోదరులకు ఈదిగా స్థలం కేటాయింపులో, ఊరట కల్పించాలి మంత్రికి వినతి.

- "ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఈదిగా స్థలం కేటాయింపు పై ముస్లిం సోదరుల ఎదురుచూపు.."
- "ప్రజా పాలన ప్రభుత్వంలో మతాలకు సమతుల్యం కల్పించాలి."

"వెంకటాపురం మండలం సి కె న్యూస్ ప్రతినిధి ముల్తాని." ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లుగా ముస్లిం సోదరులు ఈదిగా ఉత్సవాలను జరుపుకునేందుకు స్థలం విషయంలో ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి దరఖాస్తులు పెడుతున్నప్పటికీ, గత ప్రభుత్వం ముస్లిం సోదరుల ఈదిగా వినతి పత్రాలను కాల రాయడంతో... ఓటింగ్ మెజార్టీతోనే పథకాలు అమలు అవుతాయి అని నిర్ధారణకు వచ్చిన ముస్లిం సోదరులు.. ఈదిగా స్థలం కేటాయింపు విషయంలో ప్రభుత్వాన్ని అర్థించడం లో విసుగు చెంది నిర్ణయాన్ని నిమ్మదించారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం దక్కడంతో .. ముస్లిం సోదరులు ఈదిగా స్థలం కేటాయింపు విషయంలో మరల వాళ్ల ఆశలు చిగురించాయి. ఇదే విషయం గూర్చి మండల నాయకులకు మరియు మండల అధికారులతో సహా.. ముస్లిం సోదరులు ఈదిగా స్థలం కేటాయింపు గూర్చి వారి గోడును పలుమార్లు విన్నవించుకున్నారు.. ఎప్పటికప్పుడు మండల అధికారులు ఈదిగా స్థలం కేటాయింపు విషయంలో మండల అధికారులు మాట దాటేస్తున్నారు అన్న విషయాన్ని గ్రహించిన వెంకటాపురం మండల ముస్లిం సోదరులు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల గూర్చి ప్రజా దర్బార్ విషయమై



ప్రజలకు పిలుపునివ్వడంతో.. ప్రజా దర్బార్లో ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం దొరుకుతుంది అని భావించిన.. ముస్లిం సోదరులు , ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఈదిగా స్థలం కేటాయింపు విషయంలో.. మంత్రి సీతక్కకు, మరియు నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సమీక్షలో.. మరో మారు ఈదిగా స్థలం కేటాయింపుదరఖాస్తును నేరుగా మంత్రివర్యులకు అందజేశారు.. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మసీద్ కమిటీ సభ్యులు, మరియు పార్టీ మండల నాయకులు సయ్యద్ హుస్సేన్ తో పాటు స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు..

# వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం పాల్గొన్న మాజీ సర్పంచుల పోరం అధ్యక్షులు, మంచికట్ల శ్రీనివాస్

ఏప్రిల్ 10 (సీ కే న్యూస్) చేగుంట: చేగుంట మండల కేంద్రం లోని గల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి 43 వ కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి చేగుంట పట్టణ నికి చెందిన మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, తో పాటు పట్టణ వైశ్యులు తదితరులు పాల్గొన్నారు,



# సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు గిట్టుబాటు ధరకై

- మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ కృషి.
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ

పాడేరు ఏప్రిల్ 10 సి కే న్యూస్ పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించటానికి కృషి చెద్దామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమాని శ్రీ పూజ అన్నారు. శుక్రవారం ఉదయం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వారి కార్యాలయం లో ఐటిడిఏ సహాయ సహకారం తో నూతనంగా ఏర్పాటు చేసిన మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) ఏర్పాటుచేస్తూ జరిగిన సమావేశంలో ఆమే మాట్లాడుతూ సొసైటీ యొక్క ముఖ్య ఉద్దేశం అల్లూరి సీతారామరాజు జిల్లాలో సేంద్రియ పద్ధతి ద్వారా గిరిజనులు పండించే పంటలకు నాణ్యత ప్రమాణా పరిక్షలు చేయడం,వాటిని ప్యాకింగ్ చేయడం మరియు పండించిన పంటలకు అధునాతన పద్ధతిలో బార్ కోడ్ ఇవ్వడం అలాగే బార్ కోడ్ నందు వినియోగదారుడకు పంట యొక్క పూర్తి సమాచారం బార్ కోడ్ నందు పొందుపరచడం,సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటలను విశాఖపట్నం లాంటి నగరాల్లో రైతుబజారుల నందు నేరుగా వినియోగదారుడుకి రైతు నేరుగా అమ్ముకొనుటకు ఏర్పాట్లు చేయడం,పండిశీచిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం.దళారుల వద్ద రైతులు మోషపోకుండా రైతులకు అవగాహన కల్పించడం,గిరిజన రైతులకు సేంద్రియ పద్ధతి వ్యవసాయం చేయడానికి అందులో అధిక దిగుబడి తీసుకొని రావడానికి కావాల్సిన సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు రైతులకు అందించడం జరుగుతుందని, సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు కార్పొరేట్ కంపినీలుతో నేరుగా మాట్లాడి వారు నేరుగా రైతుల నుంచి పంటను కొనుగోలు చేసేవిదంగా కృషి చేయడం, సేంద్రియ పద్ధతిలో పండించే పంటలకు సంస్థ ద్వారా అనుమతి పొందిన కంపినీల భాగస్వామ్యం తో గిరిజన రైతులకు ఆర్గానిక్ సర్టిఫికెషన్ కల్పించడం వంటి కార్యక్రమాలు మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) ద్వారా గిరిజన రైతులకు పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.

అనంతరం ఈ కార్యక్రమం లో పాల్గొన రైతులతో కలిసి ఎన్నిక నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నికకాబడిన మేడిన్ అరకు వెల్ఫేర్ సొసైటీ (ఎఫ్.పి.ఓ) కార్యవర్గాని ప్రకటించారు.అధ్యక్షుడు తామరి సురేష్ బాబు,ఉపాధ్యక్షుడు కిల్లో పురుషోత్తశీ,కార్యదర్శి సోమేలి శంకురాజు,సహాయ కార్యదర్శి రాపి అప్పారావు,కోశాధికారి:కిల్లో లక్ష్మయ్య,మెంబర్లు నందుల చిన్న గంగులు,గేమ్మిలి రాంబాబు,పాంగి జినబందు,బూడిద చిన్నాబ్బాయి,మతశీ సూర్యనారాయణ పడాల్ ను ఎంపిక చేసారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలన అధికారి ముత్యాల హేమలత, ఐటీడీఏ ట్రైకర్ అసిస్టెంట్ ఎన్.సీతారామయ్య,

ఏ.సంతోష్ తో పాటు 11 మండలాల నుంచి వచ్చిన రైతుల తదితరులు పాల్గొన్నారు.



# నాతవరంలో పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభం




నాతవరం ఏప్రిల్ 10 సి కే న్యూస్ నాతవరంలో పోషణ పక్వాడ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో 8వ దశ పోషణ పక్వాడను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మీ హాజరై ప్రసంగించారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు సరైన పోషకాహారం, మంచి అలవాట్లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అవసరం లేని సమయంలో సెల్ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. చిన్నపిల్లలు ఎక్కువసేపు మొబైల్ ఫోన్లు చూడడం వల్ల వారి మాటతీరు ఆలస్యమవడం, మానసిక వికాసం దెబ్బతినే అవకాశముందని హెచ్చరించారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని, స్థానికంగా లభించే ఆహార పదార్థాలతోనే సమతుల్యాహారం అందించవచ్చని వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ పోషణ పక్వాడ కార్యక్రమాలు ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పోషకాహారం ప్రాముఖ్యత, శిశు సంరక్షణ, గర్భిణీల ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించనున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో సీడీపీఓలు శ్రీగౌరి, రమణి, ఎంపీడీఓ ఎంఎస్ శ్రీనివాస్, తహశీల్దార్ ఓ. చందనరేఖ, ఆర్డబ్ల్యూఎస్ జూనియర్ ఇంజనీర్ శ్యామ్, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఎంఎల్హెచ్వి మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

# వనపర్తి టౌన్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షాపుల కేటాయింపు -- లాటరీ ద్వారా అవకాశం



(సీ కే న్యూస్) ప్రతినిధి, వనపర్తి జిల్లా:వనపర్తి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో ఉన్న షాపులు, బ్యాంక్, సూపర్ మార్కెట్ మరియు బాంక్వెట్ హాల్‌ను లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నట్లు జిల్లా పరిపాలన ప్రకటించింది. మొత్తం 32 షాపులను లబ్ధిదారులకు పారదర్శకంగా లాటరీ ద్వారా అందించనున్నారు.
దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 9, 2026 ఉదయం 10:30 గంటల నుండి ప్రారంభమై, ఏప్రిల్ 18, 2026 సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతుంది. లాటరీ డ్రా ఏప్రిల్ 21, 2026 ఉదయం 11:00 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.
దరఖాస్తు ఫీజు రూ. 2,500గా నిర్ణయించగా, షాపులకు ఈఎండీ రూ. 15,000, బాంక్వెట్ హాల్‌కు రూ. 50,000, బ్యాంక్ ఒ సూపర్ మార్కెట్‌కు రూ. 25,000గా నిర్ణయించారు.
ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

# వలిగొండ వ్యవసాయ మార్కెట్లో కూల్చివేసిన ప్రహరీ గోడను వెంటనే నిర్మాణం చేయాలి.....

- అధికారుల,ప్రజాప్రతినిధుల
- నిర్లక్ష్య వైఖరి విడనాడాలి...
- ఎండి జహంగీర్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు




సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 10.వలిగొండ వ్యవసాయ మార్కెట్లో గత సంవత్సరం కూల్చివేసిన ప్రహరీ గోడను నిర్మించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల ప్రజాప్రతినిధుల వైఖరి వెంటనే వీడాలని నూతన గోడ నిర్మాణం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ డిమాండ్ చేశారు

శుక్రవారం రోజున వలిగొండ వ్యవసాయ మార్కెట్లో కూలిపోయిన ప్రహరి గోడను పరిశీలించి మార్కెట్ కార్యాలయం ముందు సిపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం రోడ్డు నిర్మాణం కొరకు ప్రహరి గోడను కూల్చివేశారని ఆ సమయంలోనే మార్కెట్లో ధాన్యం పోసిన రైతులకు చెందిన ధాన్యం అకాల వర్షం కారణంగా పక్కనుండి ప్రవహిస్తున్న భీమ లింగం కాల్వలోకి ధాన్యం కొట్టుకుపోయి వందలాది బస్తాల ధాన్యం నష్టం జరిగిందని అయినప్పటికీ ప్రభుత్వం కానీ మార్కెట్ అధికారులు గాని కనీసం రైతులను ఆదుకున్న పరిస్థితులు కూడా లేవని గోడ కూల్చివేసి సంవత్సరం గడుస్తున్న నేటికీ గోడను నిర్మాణం చేయలేకపోయారని తిరిగి మళ్లీ రైతులు మార్కెట్లో ధాన్యం పోస్తున్నారని మళ్లీ అకాల వర్షాలు వచ్చినప్పుడు రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు ఇప్పటికైనా వెంటనే స్పందించి కూల్చివేసిన గూడను వెంటనే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శివర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్,కూర శ్రీనివాస్,మెరుగు వెంకటేశం, కందడి సత్తిరెడ్డి,మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచందర్,కర్ణకంటి యాదయ్య,కవిడే సురేష్,దుబ్బ లింగం,బూడిద మనమ్మ, నాయకులు కొండూరు సత్తయ్య,శీలం ఇందిర, రాధారపు మల్లేశం, చేగురి నగేష్,గూడూరు బుచ్చిరెడ్డి,గంగాపురం వెంకటేశం,తదితరులు పాల్గొన్నారు